# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024 VIKARABAD


## ఆత్మహత్యల్లేని సమాజాన్ని నిర్మిద్దాం

### యువతకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు పిలుపు

సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): ఆత్మహత్యల్లేని సమాజాన్ని నిర్మిద్దామంటూ..యువతకు పిలుపునిస్తున్నారు రాచకొండ సీపీ సుధీర్‌బాబు. ఈ మేరకు ఆయన యువతకు వీడియో సందేశాలను పంపిస్తున్నారు. అందులోని సారాంశం ఇలా ఉన్నది.. 'తల్లిదండ్రులు ఫోన్ కొనివ్వలేదని, పరీక్షలో ఫెయిల్ అయ్యారని, తక్కువ మార్కులొచ్చాయని.. లవ్ ఫెయిల్ అయ్యిందని ఇలా చిన్న, చిన్న కారణాలు.. డిప్రెషన్.. ఆవేశపూరిత మనస్తత్వాలు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి.. ఓ యువత ఆగండి.. ఆలోచించండి... జీవితంలో పరీక్షలు మళ్లీ వస్తాయి.. కానీ, నీవు లేకపోతే నీ తల్లిదండ్రులకు నీలాగా ఇంకెవ్వరూ రారు. నీవు అనుకుంటున్న సమస్యలు 90 శాతం నీ ఊహ మాత్రమే... నీవు ఏదో సాధించేందుకే ఈ భూమిపైకి వచ్చావు. నీవెంటో నిరూపించుకునే సత్తా నీలో ఉన్నది. నీ గెలుపును ఆపగలిగేవాడు ఎవడూ లేడు.. ఈ దేశానికి మీరే వెన్నెముక.. రండి ఆత్మహత్యల్లేని సమాజాన్ని నిర్మిద్దాం' అంటూ సీపీ సందేశాన్ని పంపిస్తున్నారు.

## భూములు లాక్కుంటే..

# ఊరుకోం

- పేద రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతాం
- అభివృద్ధి పేరుతో కొడంగల్ ప్రజలను మోసం చేస్తున్న సీఎం
- కొడంగల్‌వాసులు రేవంత్‌ను సీఎం చేస్తే..ఆయన గిఫ్ట్‌గా పొల్యూషన్ ఇవ్వాలనుకుంటున్నారు..
- సాగు భూములు కాకుండా బీడు, గుట్టలను ఎంచుకోవాలి..
- ఫార్మా కంపెనీల స్వలాభం కోసమే కొడంగల్ -నారాయణపేట ఎత్తిపోతల పథకం
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- భూములు కోల్పోనున్న రైతుల నిరసనకు మద్దతుగా రోడ్డుపై బైఠాయించి సంఘీభావం



నిరసన తెలుపుతున్న రైతులకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఆగస్టు 11 : అభివృద్ధి పేరుతో కొడంగల్ నియోజకవర్గ ప్రజలను మోసం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం నియోజకవర్గంలోని దుద్యాల మండలం, హకీంపేటలో ఫార్మా కంపెనీల ఏర్పాటుతో భూములు కోల్పోనున్న రైతుల నిరసనకు మద్దతుగా ఆయన రోడ్డుపై బైఠాయించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది ఆ ప్రాంతానికి, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని, సొంత లాభం కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైదరాబాద్ శివారు తదితర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలను ప్రజలు వ్యతిరేకించడంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొంటూ తిరస్కరించబడిన ఆ కంపెనీలను కొడంగల్ ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఫార్మా కంపెనీల పేరుతో హకీంపేటలో 505 ఎకరాలు, పొలెపల్లిలో 130, లగచర్ల, పులిచర్ల, రోటిబండతండాల్లో 643 ఎకరాలు మొత్తంగా 1274 ఎకరాల భూములను లాక్కునేందుకు సీఎం కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. భూసేకరణ అనేది ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండాలే కానీ.. పేద రైతులను బెదిరించి బలవంతంగా భూములను లాక్కుంటే.. ఎంతటి పోరాటానికైనా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ నారాయణపేట మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భీములు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మడిగ శ్రీనివా స్, నరేశ్‌గౌడ్, మల్లేశ్, నర్సింహులు, మణికంత, నారాయణ, వెంకటయ్య, శివకుమార్, గోపాల్‌నాయక్, భూబాధిత రైతులు, ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్ ప్రజలకు కాలుష్యాన్ని గిఫ్టుగా ఇవ్వాలనుకుంటున్నారు..

కొడంగల్ నియోజకవర్గంలో 1,154 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమి అన్యాక్రాంతమైందని ..ఆ భూముల జోలికి వెళ్లకుండా సాగు భూములు కావాలనుకోవడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుతో ఈ ప్రాంతం కలుషితంగా మారుతుందని..నీరు, వాతావరణ కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. కొడంగల్ ప్రజలు రేవంత్‌రెడ్డికి సీఎం పదవిని కట్టబెడితే.. ఆయన మాత్రం సెగ్మెంట్ ప్రజలకు కాలుష్య వాతావరణాన్ని గిఫ్టుగా ఇవ్వాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దీనిని బట్టి ఈ ప్రాంత ప్రజలపై సీఎంకు ఏ విధమైన ప్రేమ, అభిమానం ఉందో ప్రజలు గుర్తించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టే ఫార్మా, సిమెంట్ కంపెనీలను ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని.. ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు.

### భూముల ఆక్రమణ సరికాదు..

ఓ పక్క నియోజకవర్గానికి కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంతో సాగునీరు అందిస్తామని చెప్పుకొంటూ .. మరో పక్క రైతుల భూములను ఆక్రమించుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ విధంగా సాగు భూములను లాక్కుంటూపోతే తీసుకొచ్చే ఎత్తిపోతల పథకం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. ఫార్మా కంపెనీల స్వలాభం కోసమే ఎత్తిపోతల పథకాన్ని తీసుకొస్తున్నట్లుగా ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మెడికల్, ఇంజినీరింగ్, వెటర్నరీ కళాశాలల ఏర్పాటును స్వాగతిస్తున్నామని.. ఫార్మా కంపెనీల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

### రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుంది

అభివృద్ధి పనులు చేపట్టేందుకు బీడు, గుట్టలు వంటి భూములను ఎంచుకుంటే ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, రైతులు కలిసికట్టుగా పోరాటం కొనసాగించాలని, సెంటు భూమిని కూడా ఇచ్చేది లేదని ఖరాఖండిగా స్పష్టం చేశారు. పొల్యూషన్‌ను అంటగట్టే రేవంత్ సర్కార్ ప్రయత్నాలు తిప్పికొట్టేందుకు అన్ని పార్టీల నాయకులు కలిసి రావాలని, పార్టీలకతీతంగా రైతులకు అండగా నిలుద్దామని ఆయన పిలుపునిచ్చారు. రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమంతో భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి.

## బీమాకు

# స్పందన అంతంతే!

### రైతుబీమా పథకానికి కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులు 9,855 మందే..

దురదృష్టవశాత్తు ఇంటి పెద్ద అయిన రైతు మృతి చెందితే అతడి కుటుంబం వీధినపడకుండా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబీమా పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రచారం నిర్వహించలేకపోయింది. ఫలితంగా రంగారెడ్డి జిల్లాలో చాలామంది రైతులు ఈ పథకంలో చేరలేదు. ఈసారి కొత్తగా 9,855 మంది మాత్రమే బీమా పథకంలో చేరగా.. ఇంకా పథకానికి జిల్లాలో 1,15,790 మంది రైతులు దూరంగానే ఉన్నారు. రుణమాఫీ ప్రక్రియ గందరగోళంగా మారడం.. వ్యవసాయ అధికారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతుండడంతోపాటు వానకాలం పంటల సాగు వివరాల నమోదు వంటి పనుల్లో బిజీగా ఉండడంతో పూర్తిస్థాయిలో రైతులను బీమా పథకంలో చేర్పించలేకపోయినట్లు తెలుస్తున్నది.

-రంగారెడ్డి, ఆగస్టు 11(నమస్తే తెలంగాణ)

- రంగారెడ్డి జిల్లాలో ఇంకా దూరంగా ఉన్నవారు 1,15,790 మంది
- గడువు పెంచినా ఆసక్తి చూపని రైతాంగం
- సరైన ప్రచారం నిర్వహించని కాంగ్రెస్ ప్రభుత్వం
- రుణమాఫీ, పంటల లెక్కల వివరాల సేకరణలో వ్యవసాయ అధికారులు బిజీగా ఉండడమూ ఓ కారణమే!

గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబీమా పథకం రైతు కుటుంబాలకు కొండంత ధీమాను కల్పించింది. దురదృష్టవశాత్తు ఇంటి పెద్ద అయిన రైతు మృతి చెందితే అతడి కుటుంబం వీధినపడకుండా ఉండేలా రైతుబీమా పథకాన్ని కేసీఆర్ తీసుకొచ్చారు.18 నుం చి 59 ఏండ్ల వయసున్న ప్రతి రైతుకూ బీమా వర్తిస్తుంది. రైతు మృతి చెందితే ఆ కుటుంబానికి 10 రోజుల్లోనే బీమా సొమ్ము రూ.5లక్షలు ఆ రైతు కుటుంబం ఖాతాలో జమఅవుతాయి. ప్రభుత్వమే రైతుకు ఎలాంటి ఖర్చులేకుండా ప్రీ మియం చెల్లిస్తున్నది. రైతులకు ధీమాగా ఉన్న ఈ పథకాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి ఈ మేరకు.. బీమా ప్రీమియం చెల్లింపునకు నిధులను కేటాయిస్తూ గత నెలలో ఉత్తర్వులను కూడా జారీ చేసింది. గతేడాది 1,97,216 మంది రైతులు బీమాలో నమోదుకాగా..వారందరికీ ఈసారి ఆటోమెటిక్‌గా రెన్యువల్ కానున్నది.

### బీమా పథకం వివరాలు..

| | |
|---|---|
| కొత్తగా పాసు పుస్తకాలు జారీ అయిన రైతులు | 23,682 |
| ఐదెకరాలకు లోపు ఉన్న వారు | 92,740 |
| ఐదెకరాలకు పైబడి ఉన్న రైతులు | 9,223 |
| గతంలో బీమాలో చేరి రెన్యువల్ కానున్న రైతులు | 1,97,216 |
| ఈసారి కొత్తగా బీమాకు దరఖాస్తు చేసుకున్న రైతులు | 9,855 |

### కొత్త బీమాకు దూరంగా లక్షకు పైగా రైతులు..

గతంలో బీమాకు దరఖాస్తు చేసుకోలేకపోయిన రైతులతోపాటు ఈ ఏడాదిలో జరిగిన భూముల క్రయ, విక్రయాల ద్వారా కొత్తగా జారీ అయిన పాస్ పుస్తకాలకు సంబంధించిన రైతులకు కూడా రైతుబీమా పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా..కొత్తగా పాస్ పుస్తకాలు జారీ అయిన రైతులు జిల్లాలో 23,682 మంది వరకు ఉన్నారు. ఐదెకరాల్లోపు భూమి కలిగిన 92,740 మంది రైతులతోపాటు, ఐదెకరాలకు మించి ఉన్న 9,223 మంది రైతులు గతం నుంచీ వివిధ కారణాలతో బీమా పథకానికి దూరంగా ఉంటున్నారు. వీరికి ఆగస్టు 5వ తేదీలోపు ఈ పథకంలో తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినా వారు ఆసక్తి చూపలేదు. ప్రభుత్వం గడువును మరో రెండు రోజులు పెంచినా రైతుల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. అర్హులందరినీ రైతుబీమా పథకంలో చేర్పించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉండేది. అయితే రుణమాఫీ ప్రక్రియ గందరగోళానికి దారితీయడంతో రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు..ఇక వానకాలానికి సంబంధించి పంటల సాగు వివరాలను పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియలో వారు బిజీగా ఉండడంతో రైతులను ఈ పథకంలో చేర్పించలేకపోయినట్లు సమాచారం. ప్రభుత్వం కూడా ఈ స్కీమ్‌పై విస్తృతంగా ప్రచా రం చేయలేకపోయింది. ఈ కారణాలతోనే చాలామంది రైతులు బీమా పథకానికి దూరంగా ఉండిపోయారు.

### మండలాల వారీగా పథకానికి కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు

| మండలం | రైతులు |
|---|---|
| ఆమనగల్లు | 531 |
| కడ్తాల్ | 487 |
| మాడ్గుల | 1,042 |
| తలకొండపల్లి | 827 |
| చేవెళ్ల | 616 |
| మొయినాబాద్ | 250 |
| షాబాద్ | 537 |
| శంకర్‌పల్లి | 445 |
| అబ్దుల్లాపూర్‌మెట్ | 132 |
| హయత్ నగర్ | 000 |
| ఇబ్రహీంపట్నం | 340 |
| మంచాల | 649 |
| యాచారం | 537 |
| బాలాపూర్ | 009 |
| కందుకూరు | 502 |
| మహేశ్వరం | 180 |
| సరూర్ నగర్ | 000 |
| గండిపేట | 027 |
| రాజేంద్ర నగర్ | 000 |
| శేరిలింగంపల్లి | 000 |
| శంషాబాద్ | 246 |
| ఫరూఖ్ నగర్ | 725 |
| చౌదరిగూడెం | 381 |
| కేశంపేట | 623 |
| కొందుర్గు | 284 |
| కొత్తూరు | 251 |
| నందిగామ | 234 |
| మొత్తం | 9,855 |

## 'సీడీఎఫ్‌డీ' ఇంక్యుబేషన్ బలోపేతానికి సన్నాహాలు



సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) ఇంక్యుబేషన్ సెంటర్ బలోపేతానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభించిన అనతి కాలంలోనే స్టార్టప్‌లను నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకొస్తుండగా.. లైఫ్ సైన్సెస్ రంగంలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేలా నిర్వాహకులు కార్యాచరణ రూపొందించారు. ఈక్రమంలో సీడీఎఫ్‌డీ వర్గాలు ప్రత్యేకంగా డీబీటీ-ఐఎల్ఎస్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారాన్ని తీసుకుంటున్నారు. ఇరు సంస్థలు కలిసి హైదరాబాద్ వేదికగా బయో స్టార్టప్‌లను ప్రోత్సహించనున్నారు. ఇప్పటికే ఓ దఫా జరిగిన చర్చల్లో డీబీటీ ప్రతినిధుల బృందం సీడీఎఫ్‌డీని సంప్రదించి పలు అంశాలపై చర్చించింది.

## 'ఇన్నోవేషన్ గాలా -2024' అవార్డులు

సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధతో వినూత్న ఆవిష్కరణలు చేసే వారిని ప్రోత్సహించేందుకు హైసియా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్‌తో కలిసి టీ హబ్ కేంద్రంగా ఇన్నోవేషన్ గాలా-2024 అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ పోటీల్లో పాల్గొని ఏఐతో కొత్త ఆవిష్కరణలు చేసే వారి నుంచి మ్యాథ్ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. మరిన్ని వివరాలకు ఈ కింది లింకు( https://mat-hub.ai/innovation-gala-2024/)లో సంప్రదించాలని, ఆగస్టు 20లోగా దరఖాస్తులను పంపించాలని, 29న టీ హబ్ వేదికగా ఇన్నోవేషన్ గాలా-2024 అవార్డుల ప్రదానం ఉంటుందని హైసియా ప్రతినిధి తెలిపారు.

*కోట్లు వెచ్చించి రూపొందించిన అధ్యయనాలు..నివేదికలు బుట్ట దాఖలయ్యాయి..ప్రభుత్వం మారగానే ప్రాజెక్టుల ప్రాధాన్యతలు మారిపోయాయి.. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను రద్దు చేయడమే ఏకైక ఎజెండాతో ముందుకెళ్తున్న కాంగ్రెస్ సర్కారు.. మహానగరానికి సంబంధించి ప్రజా రవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుల విషయంలో తీసుకున్న నిర్ణయం రవాణా రంగ నిపుణులను విస్మయానికి గురిచేసింది. రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసిన హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ.. వాస్తవాలను ప్రభుత్వ పెద్దలకు వివరించకుండా మెట్రో రెండో దశలో మార్గాలను ప్రతిపాదించింది. బీహెచ్‌ఈఎల్ - లక్డీకాపూల్ వయా గచ్చిబౌలి.. రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు వయా ఓఆర్‌ఆర్ మార్గాలు యోగ్యమైనవని నివేదికలు చెప్పినా.. వాటిని పక్కన పెట్టారు. అంతిమ నిర్ణయాలు తీసుకోవాల్సింది పాలకులే అయినా... తీసుకునే నిర్ణయాలు సరైనవో కాదో సమగ్రంగా, శాస్త్రీయంగా వివరించే బాధ్యత ప్రభుత్వ అధికారులది. ఆ పాత్రను వారు విస్మరించారు. జీ హుజూర్ అంటూ..సర్కారు ఏది చేయమంటే అది చేసేస్తున్నారు.*

*- సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ)*



# రెడ్ సిగ్నల్

### యోగ్యమైన మెట్రో మార్గాల విస్మరణ

- కోట్లు వెచ్చించి క్షేత్ర స్థాయిలో అధ్యయనాలు
- మెట్రో రైలు ప్రాజెక్టులో ప్రాధాన్యతలన్నీ బుట్టదాఖలు
- బీహెచ్‌ఈఎల్ - లక్డీకాపూల్ వయా గచ్చిబౌలి రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు వయా ఓఆర్‌ఆర్ మార్గాలు యోగ్యమైనవని చెప్పిన నివేదికలు
- పక్కన పెట్టేసిన కాంగ్రెస్ సర్కారు

అత్యంత రద్దీ మార్గాల్లో మెట్రో రైలు అందుబాటులోకి రావడం వల్ల భారీగా ఇంధన పొదుపు, అదే సమయంలో వాహనాల నుంచి వెలువడే వాయు కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుంది. కానీ ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా రేవంత్ సర్కారు ఒక తప్పు డు నిర్ణయం తీసుకున్నది. ట్రాఫిక్ సమస్యల విషయంలో హైదరాబాద్ మహానగరం మరో బెంగళూరు నగరంలా మారకూడదం టే... రాజకీయ ప్రయోజనాల కన్నా... హైదరాబాద్ నగర ప్రజా రవాణా అవసరాలే ప్రధాన ఎజెండాగా ఉండాలి. కానీ ఇక్కడ జరిగింది అందుకు విరుద్ధం. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో కొత్తగా మెట్రో మార్గాలను ప్రతిపాదించి, వాటిని నిర్మించేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నది. కానీ అత్యంత ట్రాఫిక్ రద్దీ ఉన్న మార్గాల్లో ఒకటైన బీహెచ్‌ఈఎల్-గచ్చిబౌలి-టోలిచౌకీ మీదుగా లక్డీకాపూల్ వరకు 26 కి.మీ, అదే విధంగా రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు నిర్మించాల్సిన మెట్రో మార్గాలను పూర్తిగా పక్కన పెట్టింది. మాకే అంతా తెలుసు అన్నట్లుగా రెండో దశ మెట్రో కింద ఐదు మార్గాలను ప్రతిపాదించి, అత్యంత కీలకమైన ఆ రెండు మార్గాలను మాత్రం పక్కనపెట్టారు.

### రోజు 60-70 వేల కార్ల రాకపోకలు

గచ్చిబౌలి నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా శంషాబాద్ ఓఆర్‌ఆర్ ఇంటర్‌చేంజ్ వరకు ఉన్న 24 కి.మీ మార్గంలో ప్రతిరోజూ 60-70 వేల కార్లు రాకపోకలు సాగిస్తుంటే... అందులో సగానికి పైగా కేవలం శంషాబాద్ విమానాశ్రయం నుంచే ప్రయాణిస్తుంటాయి. అంటే హైదరాబాద్ వెస్ట్, నార్త్ దిక్కుల నుంచే వేలాది కార్లు ఎయిర్‌పోర్టుకు వెళ్తున్నాయి. అదే సమయంలో ఓఆర్‌ఆర్ మీదుగా తూర్పు, దక్షిణ ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి వచ్చే కార్లు 1-2 వేలకు మించి ఉండవు. ఈ గణాంకాలన్నీ ఓఆర్‌ఆర్ మీద ఉన్న టోల్ వసూలు చేస్తున్న కేంద్రాల నుంచి సేకరించినట్లు సమాచారం. నగరంలోని ఏ దిక్కు నుంచి ఎక్కువ ట్రాఫిక్ ఎయిర్‌పోర్టులోకి వస్తున్నది.. అన్న విషయాన్ని ఓఆర్‌ఆర్ మీద రాకపోకలు సాగించే కార్లే చెబుతున్నాయి. ఇలా ఎంతో స్పష్టమైన ఆధారాలకు తోడు కోట్ల రూపాయలు వెచ్చించి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో రూపొందించిన ట్రాఫిక్ అధ్యయనాలు, ఆయా సంస్థలు ఇచ్చిన నివేదికలను బుట్ట దాఖలు చేయడంపై పట్టణ రవాణా రంగ నిపుణులు మండిపడుతున్నారు.

### అత్యవసరం ఆ రెండు మార్గాలు...

మొదటి దశలో చేపట్టిన 69 కి.మీ మెట్రో ప్రాజెక్టులో 3 కారిడార్లు ఉండగా, అందులో రెండు కారిడార్లు (ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం) మాత్రమే యోగ్యమైనవిగా నిరూపితమయ్యాయి. మూడో కారిడార్ అయిన జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో మార్గంలో ప్రయాణికులే ఉండడం లేదు. ఇదీ ఆరేండ్లుగా మెట్రో రైళ్లను నడుపుతున్న ఎల్ అండ్ టీ మెట్రో రైలు సంస్థ చెబుతున్న మాట. మొదటి దశలో అత్యంత యోగ్యమైన రెండు కారిడార్ల మాదిరిగా బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్, రాయదుర్గం-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాలు ఉంటాయని ట్రాఫిక్ అధ్యయన నివేదికలు స్పష్టం చేశాయి. అదేవిధంగా ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టినా.. రోడ్లన్నీ వాహనాలతోనే నిండిపోతున్నాయి. అలాంటి మార్గంలో మెట్రో రైలు సదుపాయం వస్తే వాహనాలకు బ్రేక్‌లు పడతాయి. కార్లను మెట్రో స్టేషన్లలోని పార్కింగ్ స్థలాల్లో ఉంచి.. ఎంచక్కా మెట్రో రైలులో ప్రయాణం చేసేందుకు నగరవాసులు ఎంతో ఆసక్తి చూపుతున్న పరిస్థితులు ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రెండో దశలో చేపడుతున్న 5 మెట్రో మార్గాలతోపాటు ఐటీ కారిడార్, హైదరాబాద్ వెస్ట్ జోన్ ప్రాంతాల మీదుగా చేపట్టాల్సిన ఆ రెండు మార్గాలను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇప్పుడు మొదలు పెడితేనే మరో 4-5 ఏండ్లల్లో ఆ మార్గాలు అందుబాటులోకి వస్తాయి. అప్పటివరకు మరింత ట్రాఫిక్ పెరిగినా.. మెట్రో అందుబాటులో వస్తే భవిష్యత్ ట్రాఫిక్ కష్టాలకు ఫుల్‌స్టాప్ పడినట్టేనని రవాణా రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆ దిశగా హైదరాబాద్ మెట్రో అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి .. పక్కన పెట్టేసిన ఆ రెండు మెట్రో మార్గాలను సైతం వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదంటున్నారు.